

బోరు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-చింతపల్లి: లోతుగడ్డ జంక్షన్ సమీపంలోని శ్మశాన వాటికకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేయనున్న బోరు నిర్మాణానికి జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్మశాన వాటికల్లో పర్యావరణ పరిరక్షణకు, చెట్ల సాగుకు, శుభ్రత నిర్వహణకు నీటి సౌకర్యం ఎంతో అవసరమన్నారు. గ్రామాభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ నాగూర్, నమ్మి శ్రీను, పిండి రమణ, గొలుసు సురేష్, నక్క రామకష్ణ తదితర గ్రామ నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి

జిడిపి 15 శాతం పెరుగుదలకు కృషి చేయండి

- కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: విజన్ 2047 నాటికి 15శాతం గ్రోత్ రేట్ పెరుగుదలకు ప్రైమరీ సెక్టార్ అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రైమరీ సెక్టార్ శాఖలైన వ్యవసాయ అనుబంధ శాఖలు, ఎస్ ఎం ఐ, పరిశ్రమలు, స్పైస్ బోర్డ్ అధికారులతో నిర్వహించిన వర్క్ షాప్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా నుండి ప్రైమరీ సెక్టార్ లో రూ,15 వేల కోట్ల వాటా ఉందన్నారు. దానిని మరో 15శాతం పెంచేందుకు గల అవకాశాలపై చర్చించారు. అదేవిధంగా జిల్లాలో వ్యవసాయ అధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి గిరిజనులను ప్రోత్సహించా లన్నారు. రైతులు సాగు చేస్తున్న విస్తీర్ణం పెంచడం, అదనపు పంటలు విస్తరించడం, మేలు జాతి విత్తనాలతో ఉత్పాదకత పెంచడం, అంతర్ పంటలు పండించడం, మార్కెటింగ్ సదుపాయం, గ్రేడింగ్, పేకింగ్‌ల ద్వారా అదనపు విలువ జోడించడం, నాణ్యత పెంపు, ఇదివరకు ఉన్న పంట విస్తీర్ణం తగ్గకుండా, దానిని స్తిరీకరిస్తూనే అదనపు ఆదాయం కోసం ప్రత్యామ్నాయాలు అన్వేషించి 15శాతం ఉత్పాదకతను పెంచాలని సూచించారు. అదేవిధంగా 15శాతం ఉత్పాదకతను పెంచడానికి నీటిపారుదల శాఖ, మైక్రో ఇరిగేషన్, పరిశ్రమల శాఖలు సహకరించాలని ఆదేశించారు. ముఖ్యంగా వ్యవసాయ ఖర్చులు తగ్గించగలిగితే ఉత్పాదకత పెరుగుతుందన్నారు. మిరియాలు, కాఫీ రైతులు ఇది వరకటితో పోలిస్తే లక్షలలో అధిక ఆదాయం పొందుతున్నారని గుర్తు చేసారు. సచివాలయం స్థాయిలో సిబ్బంది రైతులకు సరైన మార్గదర్శకం చూపించాలని, అవసరమైన పంటలు, విత్తనాలు వినియోగించే విధంగా చైతన్య పరచాలని ఆదేశించారు. రైతులు గ్రూపులుగా ఏర్పడితే మధ్యవర్తులు లేకుండా వారు అడిగిన ధరకే కొంటారని కలెక్టర్ విశ్లేసించారు. గ్రూపులుగా ఉన్న రైతులకు అన్నివిధాలా లబ్ది చేకురుతుందన్నారు. ప్రైమరీ సెక్టార్ లోని శాఖలన్నీ ఒకే యూనిట్‌గా పని చేయాలని సూచించారు. మరో మూడేళ్ళలో ఆర్గానిక్ జిల్లాగా మారనున్న నేపథ్యంలో గ్రూపులు, ఎఫ్‌పిఒలు, సంఘాలుగా ఏర్పడి అధిక లబ్ది పొందాలని సూచించారు. మండల స్థాయిలో మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో మిగిలిన సెక్టార్ల మండల అధికారులు సభ్యులుగా కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వర్క్ షాప్‌లో సంయుక్త కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, సిపిఒ ఎస్ ఎస్ ఆర్ కె. పట్నాయక్, వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ, కాఫీ, ఎపిఎంఐపి, స్పైస్ బోర్డ్ అధికారులు ఎస్ బి ఎస్ నంద్, పి.రమేష్ కుమార్ రావు, అప్పారావు, అప్పలనాయుడు, రహమాన్, బి. కల్యాణి, నీతి అయోగ్ ప్రతినిధులు చైతన్య, నారాయణ రెడ్డి, పాడేరు డివిజన్ 11 మండలాల ఎం ఎ ఓ లు, ఎం హెచ్ ఓ లు, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న పిఒ, తహశీల్దార్

గ్రీవెన్స్ సమస్యలను సత్వరం పరిష్కరించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలో మారుమూల గ్రామాల సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని కొన్నింటిని సంబంధిత అధికారులకు పంపుతున్నామని వాటిని సత్వరమే పరిష్కరించాలని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించారు. ఎపిఒ జనరల్ డిఎన్‌వి.రమణ, రంపచోడవరం తహశీల్దార్ రామకృష్ణ పాల్గొన్నారు. పిఒ సింహాచలం మాట్లాడుతూ ఈ వారం 34 ఫిర్యాదులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డిప్యూటి డైరక్టర్ యం.రుక్మాండయ్య, రంపచోడవరం పశుసంవర్ధక శాఖ డిప్యూటి డైరక్టర్ షరీఫ్, ఏజెన్సీ డిఈఒ వై.మల్లేశ్వరరావు, డిఎల్‌డిఒ కె.కోటేశ్వరరావు, ఉపాధి పథకం ఎపిడి జి.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీనివాసరావు, గాబ్రియల్, రవికుమార్, జిసిసి డివిజనల్ మేనేజర్ పార్వతీశ్వరరావు, ఎంపిడిఒ శ్రీనివాసరావుదొర, డిఎల్‌పిఒ పద్మ, సిడిపిఒ సంధ్యారాణి, పిఎఒ ఎల్.రాంబాబు, ఎడిఎ కె.విచౌదరి, సావిత్రి, వెలుగు డిపిఎం అపర్ణ, ఎఎంఒ విజయభాస్కర్, డిప్యూటి తహశీల్దార్ త్రిమూర్తులు,శ్రీధర్, వి.రవీంద్ర,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, పి.వెంకటరమణ, చైతన్య, సుబ్బారావు, మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, డిడి కార్యాలయం సూపరింటెండెంట్ కిషోర్, మలేరియా కోఆర్డినేటర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి- మోతుగూడెం : అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం, డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో మెట్టగూడెం గ్రామాన్ని సిఐ తెల్లం దుర్గప్రసాద్ సోమవారం సందర్శించి ప్రజలతో సమావేశం నిర్వహించారు. అనంతరం వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎఒబి పరిసర ప్రాంతాల్లో మావోయిస్టుల సంచారం ఉన్నట్లు సమాచారం వస్తోందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎవరూ మావోయిస్టులకు సహకరించకూడదని, ఒకవేళ మావోయిస్టులు వచ్చినట్లు సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియ జేయాలన్నారు. అనంతరం గ్రామస్తులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డొంకరాయి హెడ్‌కానిస్టేబుల్స్ కళ్యాణ్, మొహిద్దిన్, కానిస్టేబుల్ పోశయ్య పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కొనుగోలు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు

ప్రజాశక్తి-రంపచోడవరం: ఏజెన్సీలో తెల్లరేషన్‌కార్డు లబ్ధిదారులు ఎవరైనా కార్డులు తనఖా పెట్టినా, రేషన్ బియ్యం విక్రయించినా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం హెచ్చరించారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో ఆయన మాట్లాడుతూ కొంతమంది రేషన్‌బియ్యం విక్రయిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని ఇకనుంచి ఎవరైనా రేషన్ బియ్యం విక్రయించినా లేదా ఎవరి వద్దనుంచి అయినా కొన్నా క్రిమినల్‌కేసులు నమోదు చేసి రేషన్‌కార్డులు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్డులను తనఖా పెట్టినా చర్యలు తీసుకుంటామన్నారు.

తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ కార్మికుల నిరసన



నిరసన చేపడుతున్న కార్మికులు

ప్రజాశక్తి -పాడేరు :- పాడేరు ఏజెన్సీలోని తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ లో పని చేస్తున్న కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ ఆఫీస్ వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్. సుందరరావు మాట్లాడుతూ తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్లో రాష్ట్ర వ్యాప్తంగా 500 వాహనాలలో దాదాపు 500 మంది కెప్టెన్ (డ్రైవర్లు) గా పని చేస్తున్నారని . వీరంతా ప్రస్తుతం అరబిందో (ఎఇఎంఎస్) సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ వైద్య, ఆరోగ్యశాఖకు సేవలందిస్తున్నారని తెలిపారు. అరబిందో యాజమాన్యం గత ఏడేళ్లుగా నెలకు కేవలం 8800 రూపాయలు వేతనాన్ని మాత్రమే యాజమాన్యం చెల్లిస్తుందన్నారు.పిఎఫ్ వాటాను కూడా ఉద్యోగుల నుంచే మినహాయిస్తూ చట్టాన్ని ఉల్లంఘించడం దుర్మార్గమన్నారు. ఆదివారం వీక్లీ ఆఫ్, జాతీయ పండుగలు, చట్టప్రకారం అమలు చెయ్యాల్సిన సెలవులు ఏవికూడా అమలు చెయ్యడం లేదన్నారు. ఇంక్రిమెంట్లు లేవని. ఏజెన్సీ ద్వారా నియమించబడినప్పటికి వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న ఈ కార్మికులందరికీ. చట్టప్రకారం చెల్లించాల్సిన వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ తదితర సౌకర్యాలు అమలు చేయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. పిఎఫ్ ను యాజమాన్యమే చెల్లించాలని, వీక్లీ ఆఫ్, పండుగ జాతీయ శెలవులు అమలు చేయించాలన్నారు. .విధి నిర్వహణకు అవసరమైన సెల్ ఫోన్స్ ఇవ్వాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఆరోగ్యబీమా, ఎక్స్‌గ్రేషియా, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని. గతంలో ఉన్నవిధంగా కనీసం రూ.7లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న కార్మికులు సింహాచలం, కొండబాబు,విష్ణు,మౌళి,రాజారావు పాల్గొన్నారు.



కార్డులను పంపిణీ చేస్తున్న జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఛైర్మన్

కార్మికులకు ఈ - శ్రమ్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి -పాడేరు: కార్మికులందరికీ ఈ శ్రమ్ కార్డులు జారీ చేయాలని, తద్వారా కార్మికుని మరణంతో వారి కుటుంబం వీధిన పడకుండా ఆర్థిక భరోశా లభిస్తుందని జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, జిల్లా న్యాయ సేవా ప్రాధికర సంస్థ ఛైర్మన్ ఎ.రాము కార్మిక శాఖను ఆదేశించారు. సోమవారం పాడేరు కోర్టు ప్రాంగణంలో కార్మికులు, యజమానులతో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఛైర్మన్ పాల్గొని వారికి ఈ శ్రమ్ కార్డులతో లభించే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జ్ మాట్లాడుతూ, ఎన్ఆర్ఇజిఎస్ వేతనదారులు, భవన నిర్మాణ రంగంలో కార్మికులు, ఇతర సంస్థలు, దుకాణాలలో పని చేస్తున్న వారు ఈ శ్రమ్ కార్డులను పొందాలని వివరించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులకు జడ్జి చేతుల మీదుగా కార్డులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో చోడవరం కార్మిక శాఖ అధికారి పి.సూర్యనారాయణ, పోలీసు, ఎక్సైజ్ సిఐలు డి.దీనబంధు, టివిఎస్ఎన్ ఆచారి, ఎస్ఐ కేశవరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి. రమేష్, బార్ అసోషియేషన్ అధ్యక్షులు టి.ప్రసాద్ నాయుడు,తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులు

ఎపిడబ్ల్యుజెఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి అరకులోయ రూరల్: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీ.డబ్ల్యూ.జేఎఫ్) అరకులోయ మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.అల్లూరి జిల్లా అధ్యక్షులు పిడి చక్రవర్తి, జిల్లా ఉపాధ్యక్షులు మద్ది వెంకటరమణ, జిల్లా కార్యదర్శి షేక్ రహీం తుల్లా, ట్రెజరీ సునీల్ కుమార్ సమక్షంలో సోమవారం మండల కేంద్రంలోని బోసుబెడ్డ స్ప్రింగ్ రిసార్ట్స్‌లో ఏపీడబ్ల్యూజేఎఫ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో అరకులోయ మండలం అధ్యక్షుడుగా భీమిడి త్రినాథ్, ఉపాధ్యక్షులుగా కిల్లో శామ్యూల్, ప్రధాన కార్యదర్శి కిల్లో సింహాచలం, కార్యదర్శిగా వి డేవిడ్ , కార్యదర్శిగా హెచ్‌బి రాము నాయుడు, ట్రెజరీగా కోర్ర సింహాద్రి, సహాయ ట్రెజరర్‌గా ఎస్ సన్యాసి, 10 మంది కమిటీ సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షులు పిడి చక్రవర్తి మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పాటుపడాలని ఆయన కోరారు.జర్నలిస్టులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని అన్నారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్ష కార్యదర్శులు బిమిడి త్రినాథ్, డేవిడ్ మాట్లాడుతూ, భవిష్యత్తులో యూనియన్ బలోపేతం కొరకు తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కిల్లో రామన్న, ఎం రాంప్రసాద్, బి భీమన్న, జన్ని రాంబాబు పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న సిఐ, వైస్ ఎంపిపి

పులిహోర, మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-హుకుంపేట: మండలం కేంద్రంలో మోదకొండమ్మ జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గిరిజన విలేకర్ల సేవ సంఘం ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ, మంచినీరు ప్యాకెట్స్ సోమవారం పంపిణీ చేశారు. పాడేరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు, స్థానిక వైస్ ఎంపీపీ ఎస్ కొండలరావుల చేతుల మీదు గా పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాడేరు సిఐ మాట్లాడుతూ, అన్నదానం చేయడం శుభ పరిమాణమన్నారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన విలేకరుల సేవ సంఘం సభ్యులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చీడిపల్లి కొండలరావు, డి పిఆర్ఓ గోవిందరాజులు, సంధ్య, ఏపీటిఆర్ ప్రతినిధులు సూర్యారావు, దేముడుబాబు, సునీల్ కుమార్, చక్రి, నాగరాజు, పాత్రికేయులు చిట్టిబాబు, ఆనంద్, ఉదయ్ కుమార్, నాగరాజు, మూర్తి, శివ, అఖిల్, శ్రీను, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

- నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవన నిర్మాణదారులకు తాఖీదులు
- ఎంపిడిఒ శ్రీనివాస విశ్వనాథ్



మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాస విశ్వనాథ్

ప్రజాశక్తి-మారేడుమిల్లి : విధినిర్వహణలో ప్రభుత్వఉద్యోగులు నిర్లక్ష్యం వహించకూడదని, సిబ్బంది ప్రభుత్వ లక్ష్యం మేరకు పనిచేసి మండల అభివృద్ధికి సహకరించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందితో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న గృహనిర్మాణం ప్రగతి, గ్రామీణ త్రాగునీటి నిర్వహణ, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు, గ్రామసచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై సంబంధిత అధికారులతో సమీక్షించి పెండింగ్‌లో ఉన్న అంశాలను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా పంచాయతీ కార్యదర్శులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాడైపోయిన చేతిపంపులు, త్రాగునీటి బోరులను సత్వరమే బాగుచేయించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి మూడో శనివారం ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలు మేరకు ప్రతి సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు పాల్గొనాలని ఎంపీడీఓ ఆదేశించారు. మారేడుమిల్లి, సున్నంపాడు పంచాయతీల్లో అక్రమ కట్టడాలు, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం, అజరమా టూరిస్ట్ రిసార్ట్స్ కట్టడాలు ఉన్నాయని వారందరికీ త్వరలో పంచాయతీ తరుపున తాఖీదులు జారీ చేయాలని ఎంపీడీఓ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.బాలాజీ, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ సహాయక ఇంజినీర్లు బి.నారాయణ రావు, కె.ప్రశాంత్, సిడిపిఒ ప్రసన్నవిశ్వనాథ్, విద్యాశాఖాధికారి ముత్యాలరావు, వ్యవసాయాధికారి వెంకటేశ్వరావు, విస్తరణఅధికారి పి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది

తాగునీటి బోరు మరమ్మతులు



బోరు బాగుచేయిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-విఆర్‌పురం: పెద్దమట్టపల్లి పంచాయితీ పరిధి గుట్టంపేటలో మంచినీటి ఎద్దడి లేకుండా బోరును సర్పంచ్ వెట్టి లక్మి మరమ్మతులు చేయించారు. కొన్నిరోజులుగా తాగునీరు సరిగా రావట్లేదని తెలియడంతో సోమవారం మరమ్మతు చేయించారు. తాగునీటి సమస్య ఉందని తెలుసుకుని ముందు జాగ్రత్తచర్యగా బాగుచేస్తున్నట్టు ఆమె తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్, జిల్లా కమిటి సభ్యులు సోయం చినబాబు, పోడియం శ్రీరామమూర్తి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి కథనానికి స్పందన

అడ్డతీగల- ప్రజాశక్తి: రెండు రోజులుగా అడ్డతీగల మండలంలో కురుస్తున్న వర్షాలకు తడిసిపోయిన ధాన్యం గురించి ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని సివిల్‌సప్లై అధికారి రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా రైతులు పోలీస్‌శాఖ సిబ్బంది తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

జిమ్ స్టార్స్ మెగా క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం నియోజక వర్గంలో జిమ్‌స్టార్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటును డిఎస్‌పి సాయిప్రశాంత్, జనసేన పార్టీ నాయకులు సోమవారం ప్రారంభించారు. జూనియర్ కళాశాల మైదానంలో డిఎస్‌పి టాస్‌వేసి మొదటి మ్యాచ్ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని, కాసేపు బ్యాటింగ్ చేసి నిర్వాహకులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ రన్నర్స్ ప్రైజ్‌మనీ జనసేనపార్టీ తరపున ప్రకటించామన్నారు. అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి వంపూరి గంగులయ్య కూడా తనవంతు సాయం అందించారన్నారు. కార్యక్రమంలో జనసేన రంపచోడవరం పాయింట్‌ఆఫ్ కాంటాక్ట్ కుర్ల రాజశేఖర్‌రెడ్డి, ఉమ్మడి తూర్పుగోదావరి లీగల్‌సెల్ ఉపాధ్యక్షులు కాకి స్వామి, రంపచోడవరం మండల అధ్యక్షులు పి.ఆర్.పి శ్రీను, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి నర్సి ఎర్రయ్య ,సీనియర్ నాయకులు రాగాల సురేష్, పండా పోతురాజు, వీర మహిళలు పండా వరలక్ష్మి, విశాలాక్షి,మాజీ సర్పంచ్ నిరంజని దేవి తదితరులు పాల్గొన్నారు.



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న డిఎస్‌పి సాయిప్రశాంత్

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- రంపచోడవరం : ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి నియోజకవర్గ యువజన అధ్యక్షులు మఠం విజయభాస్కర్ అమరావతి సెక్రటేరియట్‌లో రీసెటిల్‌మెంట్ రీహేబిలిటేషన్ వాటర్ రిసోర్స్ ఇరిగేషన్ కమిషనర్‌ను కలిసి నియోజకవర్గ పరిధిలో ఆర్‌అండ్‌ఆర్ సమస్యలు, రీసర్వే,పెండింగ్ ప్యాకేజీ తదితర సమ్యలపై చర్చించి సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. కమిషనర్ స్పందించి అర్హులు అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డు పనులకు ఫారెస్ట్ క్లియరెన్స్ ఇవ్వాలి

ఎమ్మెల్యే మిరియాల శిరీష, నియోజకవర్గ యువ జన అధ్యక్షులు మఠం విజయభాస్కర్ పంచాయితీ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కృష్ణతేజ అటవీశాఖ ఒఎస్‌డిని కార్యాలయంలో కలిసి రంపచోడవరం నియోజవర్గంలో గ్రామాలకు రహదారులు మంజూరైనా ఫారెస్ట్ క్లియరెన్స్ లేక పనులు నిలిచిపోయాయని చర్యలు తీసుకోవాలని కోరారు. మారేడుమిల్లి, రంపగుడి సమీపంలో చెక్‌పోస్ట్ గురించి వివరించారు. కమిషనర్ స్పందించి చర్యలకు ఆదేశించారు.

ప్రత్యేక తరగతులకు హాజరుకావాలి



తరగతులను పరిశీలిస్తున్న ఎంఇఒ రామన్నపడాల్

ప్రజాశక్తి-సీలేరు: పదోతరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు ప్రత్యేక తరగతులకు ఖచ్చితంగా హాజరు కావాలని జీకేవీధి ఎంఈఓ(టు) రామన్న పడాల్ పేర్కొన్నారు. జీకేవీధి మండలం సీలేరు జిల్లాపరిషత్ పాఠశాలలో సోమవారం తరగతులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 33 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా కేవలం ఆరుగురు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. మిగిలిన 27 మంది కంపార్ట్‌మెంట్ పరీక్షలు రాయనున్నారు. ప్రత్యేక తరగతులు ఈనెల 18 వరకు నిర్వహించే విధంగా విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టారు. ఎంఈఓ రామన్నపడాల్ ప్రతిభపాఠాలు నేర్చుకోవడానికి అనుసరించ వలసిన విధానాల గురించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కాలేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- కొయ్యూరు: మండలంలోని కాకరపాడు (కొయ్యూరు) గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల(బాలురు)లో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపల్ జగన్నాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఎంపిసి, బైపిసి, సిఇసి గ్రూపులకు సంబంధించి 40 సీట్లు ఖాళీగా ఉన్నట్టు ప్రిన్సిపల్ తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 18వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కోరారు. మరిన్ని వివరాలకు 8500933303 నంబర్‌ని సంప్రదించాలని కోరారు.

ఉపాధి వేతనదారుల అవస్థలు

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలో ఉపాధి వేతనదారులు మండే ఎండలతో అవస్థలు పడుతున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ ఎక్కువవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనిప్రదేశాల్లో నీడ, తాగునీరు ఏర్పాటు చేయడం లేదు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పనివేళలు కుదించాలని ఫస్ట్ ఎయిడ్ కిట్లు పనిప్రదేశాలలో ఉంచాలని కోరుతున్నారు.

వాతావరణ హెచ్చరికలతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి- పాడేరు: రానున్న నాలుగు రోజుల పాటు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా ప్రధాన కేంద్రం పాడేరు కలెక్టరేట్ లో 24 గంటలు పని చేసే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ప్రకటించారు. ఈ నెల ఐదవ తేదీన పిడుగులతో కూడిన మధ్యస్తం నుండి భారీ వర్షాలు పడే అవకాశముందని అదే విధంగా గంటకు 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వేచే అవకాశం ఉందన్నారు, 6,7,8 తేదీలలో అల్పం నుండి మధ్యస్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజలందరూ అప్రమత్తన ఉండాలని కలెక్టర్ విజ్ఞప్తి చేసారు. అదేవిధంగా అన్ని శాఖల అధికారులు వారి వారి ప్రధాన కేంద్రాలలో అందుబాటులో ఉండి విపత్తు సంభవిస్తే ఎదుర్కొనేందుకు ప్రజలకు సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. కలెక్టరేట్ లో 24 గంటలూ పనిచేసే విధంగా టోల్ ఫ్రీ నంబర్ 18004256826తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వర్తించడానికి కలెక్టరేట్ సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించడం జరిగిందని వివరించారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది పర్యవేక్షణకు తహసిల్దార్ స్థాయి అధికారులను కూడా కేటాయించడం జరిగిందన్నారు. ఎటువంటి అవాంచనీయ సంఘటలు జరిగినా టోల్ ఫ్రీ నంబర్ 18004256826 కు ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు.

దాసరికి నివాళి

ప్రజాశక్తి-సీతమ్మధార : తెలుగు సినిమా దర్శకులు దాసరి నారాయణరావు 78వ జయంతిని తెలుగు సినిమా డైరెక్టర్స్ దినోత్సవంగా నిర్వహించారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, హెల్ప్ లండన్ సంస్థలు సంయుక్తంగా సోమవారం పౌర గ్రంథాలయం సొసైటీ అధ్యక్షులు కాశీవిశ్వేశ్వరరావు అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. దాసరి నారాయణరావు చిత్రపటానికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, దర్శకులు మీగడ శివశ్రీ, మీగడ రామలింగస్వామి, బిఎం.నాయుడు, నిర్మాత రఘురామరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సెకండ్ ఇన్నింగ్స్, ప్రావీణామృతం లఘు చిత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, దాసరి నారాయణరావు గొప్పతనాన్ని వివరించారు. సినీ దర్శకులకు గౌరవాన్ని తీసుకొచ్చారని, ఆయనొక ఫిల్మ్ విశ్వవిద్యాలయం అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బి.చిన్నారావు, హుస్సేన్, డాక్టర్ బాబ్జి, చాట్ల బాబూరావురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : హయ్యర్ పెన్షన్ విషయంలో సుప్రీం కోర్టు తీర్పును కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని హెచ్ఎంఎస్ జనరల్ సెక్రెటరీ జి.గణపతిరెడ్డి డిమాండ్‌చేశారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన అసోసియేషన్ సమావేశం పెద గంట్యాడలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి మూడేళ్లు అవుతున్నా హయ్యర్ పెన్షన్ విషయంలో ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. 30 సంవత్సరాల సర్వీస్ చేసిన కార్మికుడికి చాలా తక్కువ పెన్షన్ వస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే కనీస పెన్షన్ రూ.9000 ఇవ్వాలని కోరారు. భార్యాభర్తలకు మెడికల్ సౌకర్యం కల్పించాలని, ట్రైన్ ప్రయాణంలో 50 శాతం రాయితీ, తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు జె.అప్పస్వామి, కె.దీనబంధు, బెల్లాల నాగేశ్వరరావు, నమ్మి అప్పలనాయుడు, కాకినాడ పెంటారావు, నడిపూడి వెంకట్రావు, బి.గురప్ప, శేశెట్టి అప్పారావు, కాకినాడ సింహాసనం, ఎన్‌వి.రమణ, ద్వారపూడి గురునాథ్, పాల వెంకయ్య, నక్క అప్పారావు పాల్గొన్నారు.

అందుబాటులోకి కన్వెన్షన్ సెంటర్ : మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 95వ వార్డు పరిధి చీమలాపల్లిలో విఎంఆర్‌డిఎ నిధులు సుమారు రూ.6.24 కోట్లతో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ పనులను సోమవారం అనకాపల్లి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కన్వెన్షన్ సెంటర్‌ను అతి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. మిగిలిన పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

మర్రి కామయ్యకు ఘన నివాళి


అరకులోయలో నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- అరకు లోయ: స్వాతంత్ర్య సమరయోధుడు ఆదివాసీ ఉద్యమకారుడు మర్రి కామయ్య వర్ధంతి సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో అరకువేలిలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అరకులోయ మండల ఎంపీడీఓ లోవరాజు మాట్లాడుతూ, ఆయనను స్మరించుకోవడం ఆనందదాయకమన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, వెనుకబడిన ఆదివాసులను చైతన్యపరిచి స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఆదివాసి ప్రాంతంలో సహకార సంఘాలు ఏర్పాటు చేసి ఆదివాసుల అభ్యున్నతికి కామయ్య కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు సుంగరమెట్ట, సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు, మండల నాయకులు కిలో జగన్నాథం, పాంగి రామన్న, కొర్రా మగ్గన్న, కిన్నంగి రామారావు, కేశవ్, బాలకృష్ణ సీఐటీయూ మండల కార్యదర్శి జన్ని భగత్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: స్వాతంత్ర్య సమర యోధుడు మర్రి కామయ్య వర్ధంతిని ఆదివాసి గిరిజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గిరిజన సంఘ ప్రధాన కార్యదర్శి టి కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి హాజరైన ఆదివాసీ గిరిజన సంఘం నేత పాచిపెంట అప్పలనర్స కామయ్య విగ్రహానికి పూలమాల చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ, కామయ్య ఆశయాల సాధనే - ఆయనకు నిజమైన నివాళి అన్నారు. కామయ్య దేశ స్వాతంత్ర్యంలో ప్రధాన భూమిక పోషించారన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో అనేక నిర్బంధాలను కామయ్య ధైర్యంగా ఎదుర్కొన్నారన్నారు. ఆయన స్ఫూర్తితో ఆదివాసుల హక్కులు, చట్టాలపై ప్రభుత్వం చేస్తున్న దాడులను తిప్పి కొట్టడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన మహిళా సంఘం నాయకురాలు, ఎస్ హైమావతి, డీఎల్ఓ నాయకులు, తడిగిరి సర్పంచ్ పి రంజిత్ కుమార్, గిరిజన ఉద్యోగుల సంఘం పూర్వపు అధ్యక్షులు కె.కాంతారావు, గిరిజన సమైక్య జిల్లా నాయకులు కూడా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


హుకుంపేటలో నివాళులర్పిస్తున్న అప్పలనర్స తదితరులు

సర్కారు బడులను పరిరక్షించాలి

ఎపిటిఎఫ్ ధర్నా


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి -పాడేరు: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేసి పరిరక్షించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) అల్లూరి జిల్లా ఉపాధ్యక్షుడు అంబిడి శ్యాం సుందరం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలనే నినాదంతో మండల తహసిల్దార్ కార్యాలయాల వద్ద సోమవారం ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలతో విద్యారంగం నిర్వీర్యం అవుతున్న పరిస్థితి ఉందని, తక్షణమే ఈ పద్ధతులను విరమించుకొని సర్కారు బడులను కాపాడాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం జి. ఓ నెంబర్ 117ను తీసుకువచ్చి విద్యా రంగాన్ని అతలాకుతలం చేయగా ప్రస్తుత కూటమి సర్కారు కూడా అదే విధానాలు అనుసరిస్తుందని విమర్శించారు.గత ప్రభుత్వం 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేస్తే ఈ ప్రభుత్వం 1,2 తరగతులను కూడా విలీనం చేసేందుకు కుట్ర చేస్తోందని ఆయన ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న డి.ఏలను ప్రకటించాలని, 11వ పిఆర్‌సి బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.పిటీఎఫ్ నాయకులు కిల్లో పోతురాజు, ఎం.సత్యారావు, కన్నారావు, బాకూరు సుశీల, రమ్య ప్రియ, పాంగి లక్ష్మణ్,. గోపాలరావు పాల్గొన్నారు.

వికలాంగులకు ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-మధురవాడ : బక్కన్నపాలెంలోని ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ (ఐటిఐ శిక్షణ, ఉత్పత్తి కేంద్రం) పురుష వికలాంగ యువత నుంచి 2025-26 విద్యాసంవత్సరంలో ఐటిఐ ట్రేడుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కార్పెంటర్, వెల్డర్ (గ్యాస్, ఎలక్ట్రికల్)కు పదోతరగతి (పాస్/ఫెయిల్), షీట్‌మెటల్‌కు పదోతరగతి ఉత్తీర్ణత పొందిన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి శిక్షణ పొందేందుకు అర్హులైన వారు ఈ నెల 24వ తేదీలోగా iti.apgov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 25, 26 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన, జూన్ 2 నుంచి 10వ తేదీ మధ్య కౌన్సెలింగ్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ప్రిన్సిపల్ సిహెచ్.భాస్కరరావు(7396424319), (9502123060)ను సంప్రదించాలని సూచించారు. విద్యార్హత, టీసీ, స్టడీ, నివాస, కుల, ఆదాయ, సదరం, ఆధార్, రేషన్‌కార్డు నకళ్లు ఉండాలని పేర్కొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకి సర్వీస్ రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దిపాలెం గ్రామానికి చెందిన షీలా శ్రీను (49) మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... పెద్దిపాలెం గ్రామం రామాలయం వీధికి చెందిన షీలా శ్రీను కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆదివారం రాత్రి కూలి పనులు ముగించుకుని సైకిల్‌పై ఆనందపురం నుంచి పెద్దిపాలెం వస్తుండగా వెల్లంకి సర్వీస్ రోడ్డులో ఆటో ఢీకొట్టింది. బలమైన గాయాలైన శ్రీనును ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీను మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని కుమార్తె షీలా భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సిఐ వాసునాయుడు ఆధ్వర్యాన ఎస్ఐ శివ దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధి నమ్మివానిపేటలో ఓ వ్యక్తి సోమవారం విద్యుత్ స్తంభం పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం విజయనగరం పూల్ బాగ్ కాలనీకి చెందిన ఆవాల ఎర్రయ్య (42) చిన్న కుమారునికి ఆరోగ్యం బాగాలేదు. ఊపిరితిత్తుల సమస్య ఉందని స్థానిక ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న ఎర్రయ్య కుమారుని ఆరోగ్యం ఎలా కుదుట పడుతుందోనని ఆందోళన చెంది విద్యుత్ స్తంభం పైకి ఎక్కి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని నచ్చ జెప్పారు. దీంతో విద్యుత్ స్తంభంపై నుంచి దిగి ఆత్మహత్యాయత్నాన్ని విరమించుకున్నాడు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్టీల్‌ప్లాంట్ రోడ్డులోని శ్రీ చైతన్య కళాశాల సమీపంలో ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న రాంబాబును వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో రాంబాబు కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. రాంబాబు ఫోన్‌లో నెంబర్ల ఆదారంగా కుటుంబ సభ్యులకు స్థానికులు సమాచారం అందించారు. గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. సోమవారం రాంబాబు భార్య కరి లక్ష్మి చిన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటోలో మృతదేహం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డు పరిధి వికలాంగుల కాలనీలో రోడ్డుపై పార్కింగ్ చేసి ఉన్న ఆటోలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు ఆరిలోవ పోలీసులు ఆటోలో ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. గాంధీనగర్‌కు చెందిన నక్కా స్వామి(40)గా గుర్తించారు. ఆదివారం సాయంత్రం నక్కా స్వామి ఇంటి నుంచి బయటకు వెళ్లాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సోమవారం తెల్లవారు జామున ఆటో సీటు నుంచి ఆటోలోనే కింది బోర్లా పడి ఉన్నాడు. ముక్కుకు గాయం కూడా ఉంది. మద్యం తాగి మత్తులో కింది పడిపోయి, ఊపిరి ఆడక మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు.

లిక్విడ్ గంజాయి పట్టివేత : ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చెయ్యపేట గ్రామ శివారు అయితంపూడి జంక్షన్‌కు సమీపంలో సోమవారం ఉదయం ఇద్దరు వ్యక్తుల ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. వడ్డాది గ్రామానికి చెందిన వీర్ల నారాయణమూర్తి, రావికమతంకు చెందిన గెంజి సత్తిబాబులు మోటార్ సైకిల్‌పై రెండున్నర కిలోల లిక్విడ్ గంజాయిని తరలిస్తుండగా ముందుస్తు సమాచారంతో పోలీసులు అయితంపూడి జంక్షన్ వద్ద కాపుకాసి పట్టుకున్నారు. వారి నుండి లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. నిందితులను కోర్టుకు తరలించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1,45,500 ఉంటుందని అంచనా. కార్యక్రమంలో హెచ్‌సి జే.అర్జున్, గణేష్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులు నిలిపివేత



ప్రజాశక్తి-సీలేరు: మనసపల్లి వలసపల్లికాలనీ ఆనుకుని రహదారి నిర్మించాలని లేకుంటే పనులు అడ్డుకుంటామని కిలోసరో, గొల్లూరి జగత్, గొల్లూరి విభూషణ్, పాంగిదను హెచ్చరించారు. జీకేవీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ ప్రధాన రహదారి నుంచి వలసపల్లి మనసపల్లి వలసపల్లి కాలనీ వరకు ఉపాధి హామీపథకంలో రహదారి వంతెనలు నిర్మాణానికి ప్రభుత్వం ఐదు కోట్లు మంజూరు చేసింది. దీనికి సంబంధించి యుద్ధ ప్రాతిపదికన రహదారి పనులు చేపట్టారు. ముందుగా రహదారిని జెసిబితో చదును చేసే పనులు చేపట్టారు. ప్రధాన రహదారి నుంచి వలసపల్లి మనసుపల్లి మీదగా కొండపై నుంచి రహదారి వెళ్తుండడంతో వలసపల్లి కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామ సమీపం నుంచి కాకుండా కొండపై నుంచి నిర్మిస్తున్నారని దానివల్ల తమకు ఉపయోగం ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. పనులు నిలిపి వేయాలని గ్రామస్తులు సూపర్‌వైజర్ నానిని అడ్డుకున్నారు. జియోట్రాకింగ్ ప్రకారంగా రహదారి నిర్మించకపోతే బిల్లులు మంజూరు కావని సూపర్‌వైజర్ చెప్పినా గ్రామస్తులు ఒప్పుకోలేదు. దీంతో రెండు రోజుల నుంచి పనులు నిలిచిపోయాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని లేదంటే పనులు జరగనీయమని గ్రామస్తులు హెచ్చరించారు.

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు ఆమోదం

ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్ : ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా ఇవ్వనున్న రుణాలకు సంబంధించి 406 యూనిట్లకు ఆమోదం తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్, ఎస్‌సి కార్పొరేషన్ లోన్స్ యూనిట్ చైర్మన్ హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.సత్య పద్మ, ఎల్‌ఎండి శ్రీనివాస్, బ్యాంకు కంట్రోలర్స్ హాజరయ్యారు.

నల్లి ధర్మారావుకు చందు సాహితీ సంస్థ అవార్డు



ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చందు ట్రస్టు ప్రతిఏటా సాహితీవేత్తలకు ఇస్తున్న ప్రతిష్టాత్మక సాహిత్య పురస్కారాన్ని 2025 సంవత్సరానికిగానూ ప్రముఖ రచయిత, కవి, సీనియర్ జర్నలిస్ట్, అరసం శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు నల్లి ధర్మారావుకు ఇవ్వనుంది. ఈ మేరకు ట్రస్టు కార్యవర్గం ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు చందు సాహితీ సాంస్కృతిక సంస్థ చైర్మన్ ఆచార్య కెఎస్.చలం, కార్యదర్శి ఉప్పల అప్పలరాజు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ పురస్కారాన్ని ప్రజా వాగ్గేయకారుడు వంగపండు ప్రసాదరావు, ప్రఖ్యాతకవి, పద్మశ్రీ కొలకులూరి ఇనాక్, ప్రజాకవి, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రస్తుత ఆదికవి నన్నయ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సాతుపాటి ప్రసన్నశ్రీ, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డివి.సూర్యారావు వంటి ఎందరో ప్రముఖులు అందుకున్నారని వెల్లడించారు. ఈ నెల 18న విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే ఆచార్య చందు సుబ్బారావు లిటరరీ, కల్చరల్ ట్రస్ట్ వార్షికోత్సవ సభలో నల్లి ధర్మారావుకు ఈ పురస్కారాన్ని అందజేస్తామని తెలిపారు. రూ.10 వేలు నగదు, జ్ఞాపిక అతిథుల చేతులమీదుగా బహూకరిస్తామన్నారు.

యువత సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువత సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, 20 లక్షల ఉద్యోగాల కల్పనకు శ్రమిస్తోందని విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ అన్నారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గడిచిన 11 నెలల్లో 16,347 పోస్టులతో మెగా డిఎస్‌సి, 6100 కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ, రూ.8.5 లక్షల కోట్లు పెట్టుబడులతో పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా 5 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించేలా కూటమి ప్రభుత్వం కృషి చేసినట్టు తెలిపారు. గత ప్రభుత్వం ఎపిపిఎస్‌సిని నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దానిని బలోపేతం చేసి నిరుద్యోగ యువతకు అండగా నిలబడేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వైసిపి హయాంలో యువత నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఆ క్రమంలో నిరాశ నిస్పృహతో బెట్టింగ్, డ్రగ్స్ వంటి వాటికి అలవాటు పడి ఉజ్వలమైన భవిష్యత్తును అంధకారం చేసుకున్నారని పేర్కొన్నారు.

ఇకెవైసి.. పరేషాన్

- విశాఖ జిల్లాలో నేటికీ చేసుకోనివారు 95 వేల మంది
- విస్తృత ప్రచారం లేకపోవడమే కారణం


ఇకెవైసి నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

తెల్ల రేషన్ కార్డు కలిగిన వారు తప్పక ఇకెవైసి చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించినా ప్రచార లోపం వల్ల నేటికీ జిల్లాలో నమోదుకానివారు భారీ సంఖ్యలో ఉన్నారు. రేషన్ కార్డులో ఎంతమంది కుటుంబ సభ్యులు ఉంటే వారందరూ తప్పనిసరిగా ఇకెవైసి చేసుకోవాలని, మార్చి 31వ తేదీ నాటికి ఈ ప్రక్రియ జరగాలని ప్రభుత్వం గడువు విధించినా ఆశించిన స్థాయిలో ఆ పని జరగలేదు. ఎక్కువమంది ఇకెవైసి చేసుకోని పరిస్థితిని గమనించి గడువును ఏప్రిల్ 30వ తేదీకి పొడిగించినా పలు కారణాలతో నేటికీ పలువురు ఇకెవైసి చేయించుకోలేదు. పరిస్థితిని గమనించిన ప్రభుత్వం లబ్ధిదారులకు మరో అవకాశం ఇచ్చినట్టు కనిపిస్తోంది. నేటికీ విశాఖ జిల్లా వ్యాప్తంగా సుమారు 95 వేల యూనిట్లకు (కుటుంబ సభ్యులు) ఇకెవైసి నమోదు కాలేదు. ఇంత భారీ సంఖ్యలో నమోదు కాని పరిస్థితి ఉండడంతో మరోసారి నమోదు గడువును ప్రభుత్వం పొడిగించింది. అయితే ఇది ఎప్పటివరకూ అన్న విషయాన్ని ఇంకా స్పష్టం చేయలేదు.

అసలేం జరుగుతోంది ?

ఇకెవైసి చేసుకోకపోతే రేషన్ సరుకులు పొందటం జరగదని, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు కూడా అందబోవని అంటున్నారు. ఈ విషయం తెలిసిన తెల్ల రేషన్ కార్డు కలిగిన పేదలు ఇకెవైసి చేయించుకోవడం కోసం పరుగులు తీస్తున్నారు. అయితే, కొంతమందికి ఇకెవైసి ఎక్కడ చేసుకోవాలి ? ఏ విధంగా చేసుకోవాలి ? అన్నది తెలియడం లేదు. ఇది వారిలో తీవ్ర ఆందోళనను కలిగిస్తోంది. దీనిపై విస్తృత స్థాయిలో ప్రచారం లేకపోవడం ప్రధాన లోపంగా చెప్పవచ్చు. జిల్లాలో తాజా వివరాల ప్రకారం.. మొత్తం 5,12,619 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో మొత్తం సభ్యులు 15,91,448 మంది ఉన్నారు. మార్చి 31కి 14,42,063 మంది ఇకెవైసి పూర్తి చేసుకున్నారు. 1,49,385 మంది ఇకెవైసి చేయించుకోవలసి ఉండగా ఏప్రిల్ 30 నాటికి వారిలో 55,835 మంది మాత్రమే చేసుకున్నారు. గడిచిన ఐదు రోజుల్లో 2500 మంది చేసుకున్నట్టు ఒక అంచనా. ఈ లెక్కన 95 వేల మంది ఇంకా చేయించుకోవాల్సి ఉంది. పిల్లలు, వృద్ధులు, వేలిముద్రలు పడని వారు ఇకెవైసికి తీవ్ర అయోమయ పరిస్థితికి గురవుతున్నారు. సచివాలయాలు, మీసేవ, ఆధార్ నమోదు కేంద్రాలు వద్దకు ఇటువంటివారు వెళుతూ ఇబ్బంది పడుతున్నారు. మరోపక్క సర్వర్ పనిచేయని పరిస్థితులు కూడా ఉన్నాయి.

గ్యాస్ సబ్సిడీకి కూడా ఇకెవైసి ఉండాల్సిందే

ఇదిలా ఉండగా వంట గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్నప్పుడు ప్రభుత్వం ఇస్తానన్న పూర్తి సబ్సిడీ సొమ్ము పొందాలంటే ఇకెవైసి ఉండాలని ప్రభుత్వం ఈసరికే ప్రకటించింది. మార్చి 31లోగా గ్యాస్ బుక్ చేసుకున్న వారికి పూర్తి సబ్సిడీని ఇవ్వనున్నట్టు తెలిపింది. అయితే ఆ తేదీలోగా గ్యాస్ బుక్ చేసుకున్న అనేక మందికి సబ్సిడీ సొమ్ము అందలేదు. దీనికి కారణం అటువంటివారు ఇకెవైసి చేయించుకోకపోవడం, బ్యాంకు ఖాతా నెంబర్ ఇవ్వకపోవడమేనని తెలుస్తోంది. వాస్తవానికి జిల్లా వ్యాప్తంగా 8,90,345 మంది గ్యాస్ కనెక్షన్లు కలిగి ఉన్నారు. ఇందులో తెల్లరేషన్‌కార్డు కలిగి ఉన్నవారు 5,12,619 మంది ఉన్నారు.

ఇకెవైసి నమోదు తప్పనిసరి

జిల్లాలో అర్హులైన వారంతా సమీపంలోని రేషన్ డిపోలు, ఎండియు ఆపరేటర్ల వద్దకు వెళ్లి ఇకెవైసి వివరాలు నమోదు చేయించుకోవాలి. లేకుంటే కార్డుల నుంచి పేర్లు తొలగించడం జరుగుతుంది. ప్రభుత్వం గడువును పొడిగించింది. ఆలోగా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. 80 సంవత్సరాలు పైబడిన వారు ఇకెవైసి చేయించుకోవాల్సిన అవసరం లేదు.

-వి.భాస్కరరావు, డిప్యూటీ సివిల్ సప్లై అధికారి

జీవవైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత

గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ:

జీవవైవిధ్య పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జెవి. రత్నం పేర్కొన్నారు. సోమవారం ఎంవిపి కాలనీ ఉషోదయ జంక్షన్‌లో పర్యావరణ పరిరక్షణ మాసోత్సవం కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెలలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా దేశీయపండ్ల విత్తనాలు సేకరించాలని కోరారు. ఆ విత్తనాలతో విత్తనబంతులు తయారు చేసి సామాజిక వనాలు పెంచాలని కోరారు. మన నగరంలో పచ్చనిచెట్లు పెంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరం అందించాలన్నారు. పిచ్చుకలకు గూళు ఏర్పాటు చేయడం, పక్షులు ఇతర జీవులకు నీరు అందుబాటులో ఉంచడం, ధాన్యం కంకుల కుచ్చులు తయారు చేయడం, పక్షులకు కనిపించే విధంగా అందుబాటులో ఉంచడం, ఇళ్ల పైకప్పుల మీద కూరగాయలు, ఆకుకూరలు పండ్లు సాగు చేసేవారికి విత్తనాలు అందజేయడం తదితర కార్యక్రమాలు నిర్వహించడం, పర్యావరణ దినోత్సవాల క్యాలెండర్లు విద్యార్థులకు పంపిణీ చేయడం నిర్వహిస్తామన్నారు. విశాఖ మహానగరంలో విభిన్న ప్రాంతాల్లో నిర్వహించే ఈ పర్యావరణ కార్యక్రమాల్లో పాల్గొనదలచిన వారు తమ దగ్గర ఈ కార్యక్రమాలు నిర్వహించాలని కోరేవారు 8333849955 నంబర్‌కి తమ వివరాలను వాట్సాప్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారిణి పూర్వీరజాక్ ఉపాధ్యాయులు పి.రాధాకష్ణ, గ్రీన్ వాలంటీర్లు జె రాజేశ్వరి, ఐ.కష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన అంబేద్కర్ విగ్రహాన్ని తిరిగి నెలకొల్పాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: పెందుర్తి మండలం చినముషిడివాడ ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీలో తొలగించిన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని అధికారులే తిరిగి ఏర్పాటు చేయాలని ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, భీమ్‌సేన్‌వార్ అధ్యక్షులు కె.చిన్నారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, చినముషిడివాడ ఆక్సిజన్. డిఫెన్స్ కాలనీకి చెందిన దళిత బహుజన పేదలు పలుమార్లు కాలనీలో బుర్రా రాజేష్‌అనే వ్యక్తి భూ దురాక్రమణాలకు పాల్పడుతున్నారని, దళిత మహిళలను కులం పేరుతో దూషించి భౌతికదాడికి పాల్పడ్డాడని ఫిర్యాదు చేశామన్నారు. కాలనీని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని పార్కు నిర్వహించాలని భావించారన్నారు. అదేస్థలాన్ని బుర్రరాజేష్ ఆక్రమించాడని అయినా అధికారులు పట్టించుకో లేదన్నారు. కాలనీవాసులు అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే అప్పటివరకూ స్పందించని అధికారులు అంబేద్కర్ విగ్రహాన్ని మాత్రం తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. కలెక్టర్ స్పందిస్తూ ఆ స్థలంలో ముందుగా పార్కు అభివద్ధి చేసి, అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ జిఒ ప్రకారం ఇంటి పట్టాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: చినముషిడివాడ రెవెన్యూ పరిధిలో పది సంవత్సరాల నుండి నివసిస్తున్న 150 మంది కుటుంబాల వారికి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ 30 ద్వారా ఇంటి పట్టాలు మంజురు చేయాలని జిల్లా సిపిఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ జివిఎంసి 97వార్డు పరిధిలో, సుజాతానగర్ శివారు, టీచర్స్ లేఆవుట్ పక్కన సర్వే నెంబర్లు 184/5,185, 186/3 ప్రభుత్వం స్థలంలో 'బర్దన్ నగర్' కాలనీగా ఏర్పాటు చేసుకుని 2016 నుండి దళితులు,పేదలు 150 కుటుంబాలు తాటాకు ఇళ్లు, రేకులు షెడ్లలో నివాసాలు ఉంటున్నారని తెలిపారు. వీరిలో భవన నిర్మాణ కార్మికులు, ఇతర రోజువారీ కూలి పనులు చేసుకునేవారు ఉంటున్నారని కొన్ని కుటుంబాలు జివిఎంసికి ఇంటి పన్నులు కూడా చెల్లిస్తున్నాయని చెప్పారు. ఇటీవల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 30లో తమకు అవకాశం కల్పించి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని, పేదలు కోరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాసరావు, నాయకులు వై.రాంబాబు, ఎ.అన్నపూర్ణ పాల్గొన్నారు.

ప్రతి నియోజకవర్గం ఒక యూనిట్‌గా అభివృద్ధి

అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - అనకాపల్లి: రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని అక్కడి సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధిపై దృష్టి సారించనున్నట్టు రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ విజయకృష్ణన్ అధ్యక్షతన జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో జిడిపి పెర్ క్యాపిట్ ఇన్‌కమ్ పెంచేందుకు సమగ్ర నివేదిక తయారుచేసి ముఖ్యమంత్రికి అందజేయనున్నట్టు తెలిపారు. అనకాపల్లి జిల్లాలో వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు, విద్యుత్తు, సాగునీరు, ఆరోగ్య, ఉపాధి, వ్యవసాయ, మత్స్యశాఖ, ఉద్యానవన శాఖల అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ప్రధానంగా చోడవరం సుగర్ ఫ్యాక్టరీ విషయంపై ముఖ్యమంత్రిని కలిసి వివరిస్తామన్నారు. అన్ని శాఖల అధికారులతో ప్రతినెలా సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి కూర్చొనే పరిస్థితి లేకపోవడంతో అనేక సమస్యలు అలాగే ఉండిపోయాయన్నారు. ఇక ఇటీవల విడుదల చేసిన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో జిల్లా అత్యుత్తమ ఫలితాలు సాధించిందని కొనియాడారు. గత ఏడాది 12వ స్థానంలో ఉన్న పదో తరగతి ఫలితాలు ఈ ఏడాది ఐదో స్థానానికి చేరుకోవడం, అలాగే ఇంటర్మీడియట్‌లో ఫస్ట్ ర్యాంకు రావడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందిస్తున్నట్టు తెలిపారు. జిల్లాను అన్ని విధాల ముందంజలో ఉంచేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పివిజి.కుమార్, గవర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మల్ల సురేంద్ర, యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయకుమార్ పాల్గొన్నారు.